# మంత్రి పదవిపై తాడోపేడో!

- తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి
- కాంగ్రెస్ నేతలకు దూరంగా ఫాంహౌస్‌కే పరిమితం..!
- నమ్మించి పలుమార్లు మోసం చేస్తున్నారని తీవ్ర మండిపాటు
- నేరుగా అధిష్ఠానంతోనే తేల్చుకోవాలని యోచన
- ఇవ్వకుంటే ముఖ్యమంత్రి రేవంత్ లక్ష్యంగా కార్యాచరణ?



నల్లగొండ ప్రతినిధి, జూన్ 8 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచి మంత్రి పదవిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి నిరాశే మిగిలింది. మంత్రి వర్గ విస్తరణ ఎప్పుడు జరిగినా మంత్రి పదవి ఖాయమన్న ధీమాతో ఉన్న ఆయనకు ఆదివారం షాక్ తగిలింది. మంత్రివర్గ విస్తరణలో తన పేరు లేకపోవడంతో తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. ఆగ్రహంతో రగిలిపోతూ తెల్లవారుజామునే జూబ్లీహిల్స్‌లోని తన నివాసం నుంచి నేరుగా మెయినాబాద్‌లోని ఫాంహౌస్‌కు వెళ్లిపోయినట్టు తెలిసింది. ఆ తర్వాత రోజంతా ఎవరికీ అందుబాటులోకి రాలేదు. రాజగోపాల్‌రెడ్డిని బుజ్జగించేందుకు గడ్డం వివేక్ ఆదివారం ఉదయం ఆయనింటికి వెళ్లారు. అయితే, అప్పటికే రాజగోపాల్‌రెడ్డి ఫాంహౌస్‌కు వెళ్లిపోవడంతో వెనుదిరిగారు. వివేక్‌తో పాటు పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ రాజగోపాల్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడేందుకు ప్రయత్నించినా ఆయన అందుబాటులోకి రాలేదని తెలిసింది. ఎంపీ ఎన్నికల సమయంలో భువనగిరిలో చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మోసం చేస్తున్నారని తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు సమాచారం. తనకు మంత్రి పదవి రాకుండా కొన్ని శక్తులు అధిష్ఠానం వద్ద కుట్రలు చేస్తున్నాయని రాజగోపాల్‌రెడ్డి భావిస్తున్నారు. అందుకే ఇక నేరుగా అధిష్ఠానంతోనే తేల్చుకోవాలని నిర్ణయించుకున్నారు. అయినా మంత్రి పదవి రాకపోతే రేవంత్‌రెడ్డి టార్గెట్‌గా కార్యాచరణకు సిద్ధం చేయాలని నిర్ణయించినట్టు విశ్వాసనీయ వర్గాల సమాచారం.

### మంత్రి పదవిపై ఆది నుంచి ఆశ

రాజగోపాల్‌రెడ్డి ఆది నుంచీ మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. నల్లగొండ జిల్లా నుంచి తన అన్న వెంకట్‌రెడ్డికి అప్పటికే మంత్రి పదవి ఉండగానే నిరుడు జరిగిన ఎంపీ ఎన్నికల సమయంలో రాజగోపాల్‌రెడ్డికి అధిష్ఠానం మంత్రి పదవి హామీ ఇచ్చింది. భువనగిరిలో పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపిస్తే మంత్రివర్గంలోకి తీసుకుంటామని అప్పటి ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు హామీ ఇచ్చారు. దీంతో కోట్ల రూపాయలు ఖర్చు పెట్టుకుని చామలను గెలిపించారు. అదే సమయంలో తన భార్య కోమటిరెడ్డి లక్ష్మికి ఎంపీ టికెట్ ఇస్తే గెలిపించుకుంటానని ప్రతిపాదన పెడితే ఆమెకు ఎంపీ సీటిస్తే మంత్రి పదవి కష్టమని పార్టీ ముఖ్యులు చెప్పినట్టు అప్పట్లో చర్చ జరిగింది. అందుకే తన భార్య ఎంపీ టికెట్టును కూడా తన మంత్రి పదవి కోసం పక్కన పెట్టి చామల గెలుపు కోసం తీవ్రంగా శ్రమించారు. ఎంపీగా చామల గెలిచినా రాజగోపాల్‌రెడ్డి మంత్రి కాలేకపోయారు.

### వివేక్‌కు లేని అడ్డంకి నాకే ఎందుకు?

రాజగోపాల్‌రెడ్డి విషయంలో ప్రధానంగా ఆయన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రి పదవే అడ్డంకిగా ప్రచారం జరుగుతున్నది. ఒకే ఇంట్లో ఇద్దరికి మంత్రివర్గంలో చోటు కల్పిస్తే తప్పుడు సంకేతాలు వెళ్తాయని పార్టీ ముఖ్య నేతలు భావిస్తుండడంతోనే తాజా విస్తరణలో రాజగోపాల్‌రెడ్డికి చోటు దక్కలేదని తెలిసింది. ఈ విషయంలో పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ సైతం బలమైన సామాజిక వర్గం నుంచి ఒకే ఇంట్లో, ఒకే జిల్లా నుంచి రెండు మంత్రి పదవులు ఎలా సాధ్యమంటూ సందేహాలు లేవనెత్తినట్టు సమాచారం. ఒకవేళ రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాల్సి వస్తే అన్న వెంకట్‌రెడ్డిని మంత్రి పదవి నుంచి తప్పించాలని గతంలోనే రాహుల్‌గాంధీ తేల్చిచెప్పినట్టు తెలిసింది. ఈ కారణంగానే రాజగోపాల్‌రెడ్డికి ఇప్పుడు స్థానం లభించలేదన్న చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతున్నది. అయితే, గడ్డం వివేక్ ఇంట్లో ఇప్పటికే కొడుకు వంశీ పెద్దపల్లి ఎంపీగా, సోదరుడు వినోద్ ఎమ్మెల్యేగా ఉండగా ఇప్పుడు వివేక్‌కు మంత్రి పదవి వచ్చింది. ఇదే విషయాన్ని రాజగోపాల్‌రెడ్డి లేవనెత్తుతున్నారు. వివేక్‌కు లేని అభ్యంతరం తనకే ఎందుకని ప్రశ్నిస్తున్నారు. తన భార్య ఎంపీ టికెట్టు అడిగితే అది మంత్రి పదవికి ఆటంకంగా మారుతుందని వెనక్కితగ్గి పార్టీ సూచించిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి సపోర్టు చేసిన విషయాన్ని రాజగోపాల్‌రెడ్డి గుర్తు చేస్తున్నారు. పార్టీ చెప్పినట్టు నడుచుకుంటూ సొంతంగా జేబు నుంచి కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఎంపీగా చామలను గెలిపించుకోస్తే ఇప్పుడు పార్టీ నమ్మక ద్రోహం చేయడం ఎంతవరకు సబబని రాజగోపాల్‌రెడ్డి రగిలిపోతున్నారు.

### అధిష్ఠానంతో అమీతుమీ..

మంత్రివర్గ విస్తరణ చర్చకు వచ్చిన ప్రతిసారీ కొందరు పనిగట్టుకుని మరీ తనను అడ్డుకుంటున్నట్టు రాజగోపాల్‌రెడ్డి భావిస్తున్నారు. కొందరు మంత్రులతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి సైతం తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకుంటున్నట్టు అనుమానిస్తున్న ఆయన ఈ విషయాన్ని కేసీ వేణుగోపాల్‌తోపాటు మీనాక్షి నటరాజన్ తేల్చుకోవాలని భావిస్తున్నారు.

# క్యాబినెట్‌లోకి మరో ముగ్గురు

మొదటిపేజీ తరువాయి...

మొదటిసారి గెలుపొందిన జాటోత్ రాంచంద్రునాయక్‌ను శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా నియమించబోతున్నట్టు కాంగ్రెస్ ప్రకటించింది. కొత్త మంత్రులతో పాటు త్వరలో బాధ్యతలు చేపట్టబోయే డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్‌కు సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

### ఆ నలుగురు గైర్హాజర్

మంత్రి పదవులు ఆశించి భంగపడిన నలుగురు ఎమ్మెల్యేలు పీ సుదర్శన్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ప్రేమ్‌సాగర్‌రావు, మల్‌రెడ్డి రంగారెడ్డి కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారానికి గైర్హాజర్ అయినట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈసారి మంత్రివర్గ విస్తరణలో సుదర్శన్‌రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి చోటు దక్కుతుందని ప్రచారం జరిగింది. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా సుదర్శన్‌రెడ్డి పేరు సిఫారసు చేయటంతో ఆయనకు బెర్తు ఖాయమని అనుకున్నారు. సీఎం కార్యాలయ వర్గాలు కూడా శనివారం ఆయనకు ఫోన్ చేసి అందుబాటులో ఉండాలని సూచించినట్టు తెలిసింది. అర్ధరాత్రి వరకు ఆయన పేరు ఫైనల్ లిస్టులో ఉందనే ప్రచారం జరిగింది. కానీ, ఆదివారం ఆయన పేరు అనూహ్యంగా గల్లంతు కావడంలో మనస్తాపానికి గురైనట్టు తెలిసింది. దీంతో ఆయన ప్రమాణ స్వీకారానికి గైర్హాజరయ్యారని ఆయన అనుచరులు చెప్తున్నారు. ఇంటి ముంగిట వరకు వచ్చిన మంత్రి పదవి జానారెడ్డి మంత్రాంగంతోనే తనకు కాకుండా పోయిందనే ఆవేదనతో ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి గైర్హాజరైనట్టు తెలిసింది. అలాగే, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మంత్రి వర్గ ప్రమాణ స్వీకారానికి డుమ్మా కొట్టినట్టు తెలిసింది.

### శాఖలపై సస్పెన్స్

మంత్రులుగా ప్రమాణ స్వీకారం పూర్తి కావడంతో ప్రస్తుతం వారికి కేటాయించే శాఖలపై సస్పెన్స్ కొనసాగుతున్నది. శాఖల కేటాయింపుపై ముఖ్యమంత్రి తీసుకున్న నిర్ణయాల ఆధారంగా సీఎస్ రామకృష్ణారావు గెజిట్‌తో పాటు ఉత్తర్వులు జారీ చేయనున్నారు. అయితే ఎవరికి ఏ శాఖను కట్టబెడతారనేది ఆసక్తిగా మారింది. పాత మంత్రులకు చెందిన శాఖల్లో మార్పులు చేర్పులు చేసి కొత్త వారికి ఇస్తారా? లేక ముఖ్యమంత్రి వద్ద ఉన్న శాఖలను కేటాయిస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది.

### తొలి ప్రయత్నంలోనే వివేక్‌కు మంత్రిపదవి

వివేక్ వెంకటస్వామి ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన నేత. ఆయన తండ్రి దివంగత వెంకటస్వామి సుదీర్ఘ కాలం కాంగ్రెస్‌లో కొనసాగారు. ప్రముఖ వ్యాపారవేత్తగా ఉన్న వివేక్ కాంగ్రెస్ పార్టీతో రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. 2009లో పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి ఎంపీగా గెలిచారు.

### ఖర్గేతో వాకిటి శ్రీహరికి సాన్నిహిత్యం

బీసీ ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వాకిటి శ్రీహరి 2023 శాసనసభ ఎన్నికల్లో మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేతో శ్రీహరికి మంచి సాన్నిహిత్యం ఉన్నదని చెప్తారు. సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, జడ్పీటీసీగా పనిచేశారు.

### ఐదుసార్లు ఓడినా అడ్లూరికి జాక్‌పాట్

ఎస్సీ-మాదిగ సామాజిక వర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత. ఎన్ఎస్‌యూఐ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 1996-2001 వరకు ఉమ్మడి ఏపీలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా కూడా పనిచేశారు. పాత మేడారం నియోజకవర్గం, ధర్మపురి నియోజకవర్గాల నుంచి ఐదుసార్లు ఓడిపోయిన లక్ష్మణ్ 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మపురి నుంచి విజయం సాధించారు.

## పది ఉమ్మడి జిల్లాలకు మంత్రి పదవి ఇవ్వాలి

- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలను విస్మరించొద్దు
- ఇచ్చిన జిల్లాలకే రెండు, మూడు పదవులా..?

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి



రంగారెడ్డి, జూన్ 8 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో పది ఉమ్మడి జిల్లాలకు మంత్రివర్గంలో స్థానం లేకుండా పోయిందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి వాపోయారు. ఇప్పటివరకు స్థానం దక్కని ప్రతి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన జిల్లాలకే రెండు, మూడు మంత్రి పదవులు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రానికే గుండెకాయ లాంటి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలను విస్మరించొద్దని, రాష్ట్ర జనాభాలో ఈ రెండు జిల్లాల్లోనే 47శాతం ఉన్నారని గుర్తుచేశారు. మంత్రిపదవి విషయంలో అధిష్ఠానం తన మొర వినలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మంత్రివర్గ విస్తరణ అనంతరం పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం మల్‌రెడ్డి నివాసానికి వచ్చి మంత్రి పదవి విషయంలో బుజ్జగించారు. అనంతరం మల్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కార్యకర్తల డిమాండ్ మేరకే తాను మంత్రి పదవి అడుగుతున్నట్టు చెప్పారు. కార్యకర్తలు లేకుండా తాము పని చేయలేమని, పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు కాపాడింది తామేనని చెప్పారు. పార్టీ లైన్‌లోనే ఉండి పనిచేస్తానని తెలిపారు. అధిష్ఠానం పొరపాటు చేయవద్దని కోరినట్టు చెప్పారు. పార్టీలో కొత్తగా వచ్చినవారికి పదవులిస్తే ఎన్నో ఏళ్లుగా పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న కార్యకర్తలు బాధపడుతున్నారని తెలిపారు. అధిష్ఠానానికి తన గోడును చెప్పేందుకు అవకాశమివ్వాలని టీపీసీసీ అధ్యక్షుడిని కోరినట్టు తెలిపారు. మంత్రి పదవి విషయంలో రాహుల్‌గాంధీ ఏ నిర్ణయం తీసుకున్నా సమ్మతిస్తామని, పార్టీకి నష్టం జరుగుతున్నదని అధిష్ఠానం దృష్టికి తీసుకొచ్చినా దిద్దుబాటు చర్యలు తీసుకోవటం లేదని వాపోయారు. మంత్రి పదవి విషయంలో తన సామాజిక వర్గం అడ్డొస్తే పార్టీకోసం ఏ త్యాగమైనా చేస్తానన్నారు.

## మోదీ స్కూల్.. బాబు కాలేజీలో చదువుకున్నా!

- ఇప్పుడు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ వద్ద ఉద్యోగం చేస్తున్నా
- బండారు దత్తాత్రేయ 'ప్రజల కథే.. నా ఆత్మకథ' పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్‌రెడి ఆస్తకికర వ్యాఖ్యలు
- కిషన్‌రెడ్డితో తనది ప్రత్యేక అనుబంధమన్న సీఎం
- ఏపీ సీఎం చంద్రబాబుపై మంత్రి కోమటిరెడ్డి ప్రశంసలు



శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, బీజేపీ ఎంపీ లక్ష్మణ్, కాంగ్రెస్ నేతలు కే కేశవరావు, వీ హనుమంతరావు, ఇతర నేతలు పాల్గొన్నారు.

హైదరాబాద్, జూన్ 8 (నమస్తే తెలంగాణ): తాను ప్రధాని మోదీ స్కూల్, చంద్రబాబు కాలేజీలో చదువుకున్నానని, ఇప్పుడు రాహుల్‌గాంధీ వద్ద ఉద్యోగం చేస్తున్నానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆదివారం శిల్పాకళావేదికలో జరిగిన హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ జీవిత చరిత్ర 'ప్రజల కథే.. నా ఆత్మకథ' పుస్తాకావిష్కరణ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నీతి ఆయోగ్ సమావేశం సందర్భంగా భోజన సమయంలో చంద్రబాబును చూపిస్తూ 'ఆప్ కే సాథీ ఇదర్ హై' అని మోదీ అన్నారని, అప్పుడు తాను పైవిధంగా స్పందించినట్టు రేవంత్ గుర్తుచేసుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు అందరితోనూ తనకు సన్నిహిత సంబంధాలు ఉండేవని, వాటిని దాచుకోవాలని ఎప్పుడూ అనుకోలేదని పేర్కొన్నారు. అందుకనే మంత్రివర్గ విస్తరణ ఉన్నా, అది అయిపోగానే దత్తాత్రేయ కోసం ఈ కార్యక్రమానికి హాజరైనట్టు చెప్పారు. జాతీయ రాజకీయాల్లో మాజీ ప్రధాని వాజపేయికి ఉన్న గౌరవం రాష్ట్రస్థాయిలో దత్తాత్రేయకు ఉందని పేర్కొన్నారు.

### మనోహర్ షిండే వల్ల ఈ స్థాయికి..

మనోహర్ షిండే వల్లే ఈ రోజు తానీ స్థాయిలో ఉన్నట్టు దత్తాత్రేయ తెలిపారు. వీ రామారావు తనను పాలిటిక్స్‌లోకి తీసుకొచ్చారని, ఇంద్రసేనారెడ్డి తన వెన్నంటే ఉన్నారని పేర్కొన్నారు. రాజకీయాలు వృత్తి, వ్యాపారం కాదని సమాజం కోసమే పనిచేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, ఏపీ, ఒడిశా, త్రిపుర గవర్నర్లు జస్టిస్ అబ్దుల్ నజీర్, కంభంపాటి హరిబాబు, ఇంద్రసేనారెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, విశ్రాంత సీజేఐ ఎన్వీరమణ, శాసన మండలి చైర్మన్ గుత్తాసుఖేందర్‌రెడ్డి,

### హైటెక్ సిటీ అంటే చంద్రబాబే గుర్తొస్తారు : కోమటిరెడ్డి

పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబును మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పొగడ్తలతో ముంచెత్తారు. 'మన ప్రియతమ నాయకుడు' అంటూ ప్రసంగంలో చంద్రబాబును ఆకాశానికి ఎత్తారు. హైటెక్ సిటీ చూసినా, హైదరాబాద్ అన్న పదం వినబడినా చంద్రబాబే గుర్తొస్తారని పేర్కొన్నారు. అయితే ఈ సభలో రేవంత్‌రెడ్డి, చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తడంతో గురు, శిష్యుల బంధంపై మరోమారు చర్చ మొదలైంది.

### కిషన్‌రెడ్డితో అనుబంధం : రేవంత్

కిషన్‌రెడ్డితో తనకున్న ప్రత్యేక అనుబంధం గురించి అందరికీ తెలుసని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. తామిద్దరం కలిస్తే తెలంగాణ అభివృద్ధి వేగంగా దూసుకెళ్తుందని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా కిషన్‌రెడ్డిని గౌరవిస్తానని, అప్పుడప్పుడు ప్రశ్నిస్తూనే తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తాను ఎప్పుడు ముందుంటానని చెప్పారు. రేవంత్ చేసిన వ్యాఖ్యలతో కాంగ్రెస్, బీజేపీ రహస్య బంధం బయటపడిందనే చర్చ మొదలైంది.

### కిషన్‌రెడ్డిపై ఘాటు వ్యాఖ్యలు

కిషన్‌రెడ్డిపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఘాటుగా స్పందించారు. 'రేవంత్‌రెడ్డీ.. మీరు ఎవరిని హెల్ప్ అడుగుతున్నారు. చెవులు ఉన్నాయి కానీ వినబడదు, నోరు ఉంది కానీ మాట్లాడరు. అలాంటి మహానుభావులను మీరు హెల్ప్ అడిగితే ఎక్కడ హెల్ప్ చేస్తారండి' అంటూ కిషన్‌రెడ్డి టార్గెట్‌గా వ్యాఖ్యలు చేశారు.

## ఆ జిల్లాలకు ముగ్గురేసి మంత్రులు

- ఉమ్మడి ఖమ్మం, కరీంనగర్, పాలమూరు జిల్లాలకు మూడేసి మంత్రి పదవులు
- నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు నోచాన్స్
- ముస్లిం వర్గం నుంచి ఒక్కరికీ దక్కని అవకాశం

హైదరాబాద్, జూన్ 8 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వంలో మరో ముగ్గురు మంత్రులు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో క్యాబినెట్‌లో మంత్రుల సంఖ్య 15కు చేరుకుంది. మంత్రివర్గ కూర్పులో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు సమ ప్రాధాన్యం దక్కలేదు. కొన్ని జిల్లాలకు మూడేసి మంత్రి పదవులు దక్కితే, కొన్ని ఉమ్మడి జిల్లాలకు ఒక్క మంత్రి పదవి కూడా రాలేదు. ఖమ్మం జిల్లాకు మంత్రులు భట్టివిక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆదివారం జరిగిన విస్తరణతో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మూడు మంత్రి పదవులు దక్కినట్టు అయింది. ఇప్పటికే జిల్లా నుంచి మంథని శాసనసభ్యుడు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, హుస్నాబాద్ నుంచి పొన్నం ప్రభాకర్ మంత్రులుగా ఉన్నారు. తాజాగా ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు మంత్రి పదవి దక్కింది. ఇక వీటి తర్వాత ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ఇప్పటికే కొడంగల్ నుంచి రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా, కొల్లాపూర్ నుంచి జూపల్లి కృష్ణారావు మంత్రిగా ఉన్నారు. తాజాగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి వరించింది. ఇక ఉమ్మడి వరంగల్ నుంచి సీతక్క, కొండ సురేఖ మంత్రులుగా ఉన్నారు. నల్లగొండ జిల్లా నుంచి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రులుగా ఉన్నారు. తాజా విస్తరణలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి గడ్డం వివేక్‌కు స్థానం దక్కగా, ఆ జిల్లా నుంచి ఏకైక మంత్రిగా ఆయన వ్యవహరిస్తారు. ఇక కనీసం ఒక్క మంత్రి పదవి కూడా లేని ఉమ్మడి జిల్లాలుగా నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్‌లుంటాయి. ఈ మూడు ఉమ్మడి జిల్లాల నుంచి ఒక్కరికి కూడా మంత్రి వర్గంలో ప్రాతినిధ్యం లేకపోవడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారని, ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఈ తరహా రాజకీయ వివక్ష ఏనాడూ లేదని ఆయా జిల్లాల కాంగ్రెస్ నేతలే వాపోతున్నారు.

### మైనార్టీ మంత్రి లేరు

రాష్ట్ర చరిత్రలో మరో అరుదైన రికార్డు రేవంత్ సర్కారుకు దక్కుతున్నది. ఉమ్మడి రాష్ట్రంలో, ప్రత్యేక రాష్ట్రంలో కూడా 18 నెలలపాటు ముస్లి వర్గానికి మంత్రి పదవి లేకపోవడం ఇదే తొలిసారి. రాష్ట్రంలో సంఖ్యాపరంగా మైనార్టీల్లో ముస్లింలు అధికంగా ఉంటారు. ఈ వర్గానికి మంత్రివర్గంలో స్థానం కల్పిస్తుంటారు. కానీ, ఈసారి ముస్లిం వ్యక్తికి మంత్రివర్గంలో స్థానం దక్కలేదు. మంత్రివర్గ విస్తరణ మళ్లీ ఎప్పుడు జరుగుతుందో తెలియదు. విస్తరణ జరిగినా మైనార్టీలకు స్థానం ఉంటుందో, లేదో కూడా స్పష్టత లేదు. ఇక, మైనార్టీలతోపాటు ఈసారి లంబాడా సామాజికవర్గానికి కూడా స్థానం కల్పించలేదు. రాష్ట్ర మంత్రివర్గంలో లంబాడా వర్గానికి ప్రాతినిధ్యం ఉండాలన్న తీవ్రమైన డిమాండ్ ఉన్నది. మంత్రి పదవి ఇవ్వకుండా డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చి ఆ వర్గానికి ఏదో చిన్న ఉపశమనం కల్పించామన్న భావనను కాంగ్రెస్ పార్టీ కల్పిస్తున్నది.

### మూడు పదవులు.. 30మంది ఆశావహులు

రాష్ట్రంలో ఇప్పటి వరకు 15 మంత్రి పదవులను భర్తీ చేశారు. ఇంకో మూడు మంత్రి పదవులను భర్తీ చేయాల్సి ఉన్నది. ఇప్పుడు ఆశావహులను బుజ్జగించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం ఈ మూడు మంత్రి పదవులనే చూపిస్తున్నది. వీటిని భర్తీ చేసే ముందు మిమ్మల్నే పరిగణనలోకి తీసుకుంటామని చెప్తున్నది. అయితే, ఈమూడు మంత్రి పదవులనే 30 మంది ఆశావహులకు ఎరగా వేస్తుండడం గమనార్హం. మంత్రి పదవి అడుగుతున్న అందరికీ ఇంకో మూడు పదవులున్నాయి కదా, దాంట్లో మీకు ఒకటి గ్యారెంటీ అని చెప్పి బుజ్జగిస్తున్నది.


## రాజీనామాకు సిద్ధమై మెత్తబడిన సుదర్శన్‌రెడ్డి

ఇంటికెళ్లి బుజ్జగించిన మీనాక్షి, మహేశ్‌కుమార్‌గౌడ్

బోధన్, జూన్ 8: మంత్రివర్గ విస్తరణలో తనకు స్థానం దక్కకపోవడంతో అసంతృప్తికి గురైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రచారం జరిగింది. విషయం తెలిసి రంగంలోకి దిగిన ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి స్వయంగా వెళ్లారు. ఆమె వెంట పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, వేం నరేందర్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, మరికొందరు నేతలు ఉన్నారు. అసంతృప్తితో ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని, ప్రభుత్వంలో సముచిత స్థానం ఉంటుందని మీనాక్షి ఆయనకు నచ్చజెప్పినట్టు తెలిసింది. దీంతో మెత్తబడిన ఎమ్మెల్యే అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని అనుచరులకు చెప్పినట్టు తెలిసింది.

# రగులుతున్న ఎమ్మెల్యేలు

- మంత్రి పదవులు రాని ఎమ్మెల్యేల్లో అసంతృప్తి జ్వాల
- ఏ ప్రాతిపదికన పదవులు ఇచ్చారంటూ సూటి ప్రశ్నలు
- 'సైకిల్ కాంగ్రెస్'కు పెద్దపీట వేశారని మండిపాటు
- బుజ్జగించే ప్రయత్నాలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 8 (నమస్తే తెలంగాణ): మంత్రివర్గ విస్తరణ కాంగ్రెస్‌లో చిచ్చు పెట్టింది. మంత్రి పదవుల మీద కోటి ఆశలు పెట్టుకొని 17 నెలలుగా వెయ్యి కళ్లతో ఎదురు చూస్తున్న ఎమ్మెల్యేలను అధిష్ఠానం తీవ్ర నిరాశకు గురిచేసింది. కష్టకాలంలోనూ పార్టీని నమ్ముకుని అండగా నిలిచిన నేతలను పక్కన పెట్టి గోడదూకి వచ్చిన వారికి ప్రాధాన్యం ఇచ్చారని సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇతర పార్టీలు నుంచి వచ్చిన 50 శాతమందికి తొలి విడతలో మంత్రి పదవులు ఇచ్చినా, పదేండ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన పార్టీని కాపాడుకోవాలన్న ఆలోచనతో అధిష్ఠానం నిర్ణయాన్ని గౌరవించామని చెప్తున్నారు. మలిదశ విస్తరణలోనైనా పార్టీని నమ్ముకున్న వారికి అవకాశం కల్పిస్తారనుకుంటే ఇప్పుడూ అలాగే చేశారని ఆవేదన చెందుతున్నారు. 17 నెలలుగా ఆరు క్యాబినెట్ బెర్తులు ఖాళీగా ఉండగా మంత్రివర్గ విస్తరణ అంశం తెరమీదపైకి వచ్చిన ప్రతిసారీ సామాజిక సర్దుబాట్లు, వర్గపోరు తదితర కారణాలతో 32సార్లు ఆగిపోయింది. ఇప్పుడు మూడుస్థానాలు భర్తీచేసి మరో మూడింటిని ఖాళీగా ఉంచడంపై నేతలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. ఈసారి రెడ్డి, వెలమ సామాజిక వర్గాల నుంచి కనీసం ఒక్కరికైనా అవకాశం దక్కుతుందనే ప్రచారం సాగింది. దీంతో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, పీ సుదర్శన్‌రెడ్డి ఆశలు పెట్టుకున్నారు. అయితే, వారికి నిరాశే ఎదురైంది.

### సైకిల్ కాంగ్రెస్‌కు పెద్దపీట

మంత్రి పదవి దక్కకపోవడంపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అసంతృప్తితో ఉన్నారు. ఒకే ఇంట్లో నుంచి రెండు పదవులు ఇవ్వలేమని చెప్తే, వివేక్ కుటుంబంలోని మొత్తం ముగ్గురికి పదవులు ఇచ్చారని, వివేక్ కొడుకు వంశీకి పెద్దపల్లి ఎంపీగా, ఆయన అన్న వినోద్‌కు బెల్లంపల్లి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారని, ఇప్పుడు వివేక్‌కు మంత్రి పదవి కూడా ఇచ్చారని, ఒక్క కుటుంబానికే ఇన్ని పదవులు ఎలా ఇచ్చారని మీనాక్షి నటరాజన్‌ను ప్రశ్నించినట్టు సమాచారం. దీంతోపాటు పార్టీలో సైకిల్ కాంగ్రెస్ వారి హవానే కొనసాగుతున్నదని, సీఎం రేవంత్‌రెడ్డి, సీతక్క వంటివాళ్లకు పదవులు ఇచ్చినపుడు తనలాంటి కాంగ్రెస్ వీరాభిమానికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించినట్టు సమాచారం. వలస వచ్చినవారికి, వెన్నుపోటుదారులకు పదవులు ఇచ్చి తమ గొంతు కోశారని ఆగ్రహం వ్యక్తంచేసినట్టు సమాచారం.

### దారికి తెచ్చుకునే ప్రయత్నం

పార్టీ అధిష్ఠానం మంత్రివర్గంలో ముగ్గురి పేర్లు ప్రకటించిన వెంటనే మంత్రివర్గంలో స్థానం ఆశించినవారు ఖిన్నులయ్యారు. ముఖ్యంగా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, బోధన్ ఎమ్మెల్యే పీ సుదర్శన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తదితరులు పార్టీ తమను పట్టించుకోకపోవడంపై తీవ్ర అసంతృప్తికి గురయ్యారు. మంత్రి పదవులు ఆశించి భంగపడ్డవారిని తమదారిలో తెచ్చుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్ ప్రయత్నించారు. అందరికీ స్వయంగా ఫోన్లు చేసి బుజ్జగించే ప్రయత్నం చేశారు.

### పెద్దపల్లి పరిధిలో ముగ్గురు మంత్రులు

ఈసారి మంత్రివర్గ విస్తరణలో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు మంత్రి పదవి దక్కడంతో విచిత్రంగా పెద్దపల్లి పార్లమెంటు నియోజక వర్గం పరిధిలోనే ముగ్గురు మంత్రులయ్యారు.

### వీరికి మొండిచెయ్యి

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలకు మంత్రివర్గ విస్తరణలో మొండిచెయ్యి చూపారు. చేవెళ్ల, బాన్సువాడ, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, దానం నాగేందర్, అరికపూడి గాంధీ మంత్రి పదవి ఆశించారు. కానీ, వీరెవరికీ మంత్రి పదవులు దక్కలేదు.

### ఇండ్లకు వెళ్లి సర్దిచెప్పే ప్రయత్నం

మంత్రివర్గంలో బెర్తులు ఖరారైన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, మీనాక్షినటరాజన్ ఆశావహుల ఇండ్లకు పరుగులు తీశారు. రేవంత్ ఫోన్లో మాట్లాడి బుజ్జగించే ప్రయత్నం చేస్తే, మీనాక్షి నటరాజన్ స్వయంగా సుదర్శన్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, ప్రేంసాగర్‌రావు తదితరులతో మాట్లాడారు. శనివారం అర్ధరాత్రి నుంచే బుజ్జగింపులు జరిపారు.

## ఘనంగా హెచ్ఎంఏ అవార్డులు

హైదరాబాద్, జూన్ 8 (నమస్తే తెలంగాణ): మేనేజ్‌మెంట్, సృజనాత్మకత, డిఫెన్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ లాంటి రంగాల్లో అపారమైన సేవలు అందించినందుకు పలువురు అసాధారణ వ్యక్తులు, సంస్థలను హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(హెచ్ఎంఏ) తన వార్షిక అవార్డుల కార్యక్రమంలో సత్కరించింది. ఆదివారం హైదరాబాద్‌లోని హోటల్ మారిగోల్డ్ వేదికగా కార్యక్రమాన్ని నిర్వహించారు. జీవన సాఫల్య అవార్డును రిటైర్డ్ వింగ్ కమాండర్ ఆవుల భరత్ భూషణ్, లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును శరత్ చంద్ర మారోజు, 'బెస్ట్ మేనేజర్ ఆఫ్ ద ఇయర్' అవార్డును స్పర్శ హాస్పైస్ క్యాన్సర్ కేర్ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ వాసుదేవ్ చతుర్వేది గెలుచుకున్నారు. ఫిన్ టెక్ కంపెనీల్లో ఒకటైన జాగిల్ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ రాజ్ పీ నారాయణకు 'ఆంత్రప్రెన్యూర్ ఆఫ్ ద ఇయర్ 2024-25' అవార్డు అందించారు. చిన్న తరహా వ్యాపారవేత్తల్లో పోచంపల్లికి చెందిన యువ వ్యాపారవేత్త చిట్టిమళ్ల పండును గుర్తించడం ఈ కార్యక్రమంలో ఒక స్ఫూర్తి దాయకమైన అంశంగా నిలిచింది. ముఖ్య అతిథిగా ప్రముఖ వ్యూహాత్మక ఆలోచనల నిపుణుడు, రిటైర్డ్ కమాండర్ మాధవరావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో హెచ్ఎంఏ అధ్యక్షుడు కే చంద్రశేఖర్, కార్యదర్శి అల్వాల దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# సెల్ఫీ మోజు.. ఆరుగురు జలసమాధి!

- సరదాగా గోదావరికి వెళ్లి గల్లంతు
- నీటిలో మునిగిన వారి మృతదేహాల వెలికితీత.. పోస్టుమార్టంకు తరలింపు
- మహదేవపూర్ మండలం అంబటిపల్లిలో విషాదఛాయలు



రాంచరణ్, శివమనోజ్, రాహుల్, రక్షిత్, సాగర్, మధుసూదన్ (ఫైల్)

జయశంకర్ భూపాలపల్లి, జూన్ 8(నమస్తే తెలంగాణ) : సెల్ఫీ మోజుకు ఆరుగురు జలసమాధి అయ్యారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డ వద్ద గోదావరిలో శనివారం గల్లంతైన ఆరుగురి మృతదేహాలు ఆదివారం లభ్యమయ్యాయి. ఈ ఘటన ఐదు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. మహదేవపూర్ మండలం అంబటిపల్లికి చెందిన పట్టి వెంకటస్వామి ఇంట్లో ఈ నెల 5న జరిగిన ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు అంబటిపల్లికి చెందిన పట్టి మధుసూదన్ (18), పట్టి శివమనోజ్ (15), తొగరి రక్షిత్ (13), కర్ణాల సాగర్ (16), మహాముత్తారం మండలం కొర్లకుంటకు చెందిన బొల్లెడ్ల రాంచరణ్ (17), పసుల రాహుల్ (19) వచ్చారు. పిల్లల కోరిక మేరకు పట్టి వెంకటస్వామి వారిని శనివారం మేడిగడ్డలోని గోదావరి తీరానికి ఈతకు తీసుకువెళ్లాడు. అందులో అతడి ఇద్దరు కుమారులు కూడా ఉన్నారు. నీళ్లు ఎక్కువగా ఉన్నాయని లోనికి వెళ్లొద్దని వారించినా సెల్ఫీలు, రీల్స్ తీసుకుంటూ నీటిలో దిగారు. ఈ క్రమంలో ఒక్కొక్కరుగా నీటి ప్రవాహంలో మునిగిపోవడం గమనించిన వెంకటస్వామి కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. కండ్లముందే తన ఇద్దరు కుమారులతోపాటు బంధువుల పిల్లలు నలుగురు గల్లంతు కావడంతో ఒడ్డున రోదిస్తూ బంధువులకు సమాచారం అందించాడు. కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి గజ ఈతగాళ్లను పిలిపించి గాలింపు చర్యలు చేపట్టారు. సింగరేణి రెస్క్యూటీం గాలించినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం తిరిగి గాలింపు చేపట్టగా మధ్యాహ్నం ఆరుగురి మృతదేహాలు లభ్యమయ్యాయి. మహదేవపూర్ ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు డిమాండ్ చేశారు. కాగా, మంత్రి శ్రీధర్‌బాబు ఆదివారం రాత్రి అంబటిపల్లి గ్రామానికి వచ్చి బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతుల కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియాతోపాటు, ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చారు.



మహబూబాబాద్‌లో ఎమ్మెల్యే మురళీనాయక్ వాహనాన్ని అడ్డుకున్న గిరిజన రైతులు

## ఎమ్మెల్యే మురళీనాయక్‌కు నిరసన సెగ

- డాక్టర్ ప్రమోద్‌రెడ్డి తమ భూములు ఆక్రమించారని గిరిజనుల ఆందోళన
- పాఠశాల భవనాన్ని ప్రారంభించకనే వెనుదిరిగిన మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్, జూన్ 8 : మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్‌కు ఆదివారం నిరసన సెగ తగిలింది. పట్టణానికి చెందిన డాక్టర్ ప్రమోద్‌రెడ్డి పదిమంది గిరిజన రైతులకు సంబంధించిన 30 ఎకరాల భూమిని ఆక్రమించి, అందులో పెద్దపెద్ద భవనాలతోపాటు పాఠశాల భవనాన్ని సైతం నిర్మించాడని ఆరోపించారు. ఆదివారం స్కూల్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే వెళ్తున్న క్రమంలో గిరిజన రైతులు ఆయన కారుని అడ్డుకొని రోడ్డుపైన ఆందోళన చేశారు. గిరిజన రైతులకు అండగా నిలవాల్సింది పోయి ప్రమోద్‌రెడ్డికి సపోర్ట్ చేస్తూ పాఠశాల ప్రారంభోత్సవానికి ఎలా వెళ్తారని ఎమ్మెల్యేను నిలదీశారు. టౌన్ పోలీసులు, సీఐ దేవేందర్ చేరుకుని వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. దీంతో ఎమ్మెల్యే మురళీనాయక్ స్కూల్‌ను ప్రారంభించకుండానే తిరిగి వెళ్లిపోయారు.